

లారీ బీభత్సం

హైదరాబాద్–విజయవాడ హైవేపై చౌటుప్పల్‌లో లారీ అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాల పైకి దూసుకెళ్లింది. -8లో



నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. -8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**554.00** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**63,900** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**1,650** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	నిల్
కుడికాల్వ ద్వారా	:	నిల్
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	**1,650** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

పనుల్లో అలసత్వంపై ఆగ్రహం



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

చండూరు : భవిత కేంద్రం పనుల్లో అలసత్వంపై అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చండూరు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవిత కేంద్రం పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు పనులు పూర్తిచేయకపోవడంపై ఎంఈఓ, సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు పూర్తి చేయకపోవడానికి గల కారణాలను తెలుసుకున్నారు. నాలుగు రోజుల్లో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీదేవి, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ నిర్మల తదితరులు ఉన్నారు.

బాలగేయాలతో పిల్లలకు మనోవికాసం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

కనగల్ : పిల్లల మనోవికాసానికి బాలగేయాలు దోహదపడతాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన 'ఊగుతున్న ఉయ్యాల' బాలగేయాలను సోమవారం ఆయన పీఆర్‌టీయూ భవన్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి గ్రంథాలయంలో ఇటువంటి పుస్తకాలు ఉంటే విద్యార్థులు అభ్యసనంపై శ్రద్ధ చూపుతారని అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుండు లక్ష్మణ్‌రావు, కాలం నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి మేకల జానారెడ్డి, కళావతి, యూసుఫ్ పాషా, సైదిరెడ్డి, నామిరెడ్డి వెంకటరెడ్డి, మురళి, వీరమల్ల శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా హఫీజ్‌ఖాన్



రామగిరి(నల్లగొండ): నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా డాక్టర్ ఎండీ.అబ్దుల్ హఫీజ్‌ఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హఫీజ్‌ఖాన్ కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర, జిల్లాస్థాయిలో అనేక పదవులు చేపట్టారు. 1994 నుంచి 1996 వరకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేసి డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యం ఇస్తానన్నారు. గ్రంథాలయాల్లో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులు మెరుగైన ఫలితాలు సాధించేలా వసతులు కల్పిస్తానన్నారు.

శివన్నగూడెం రిజర్వాయర్ పనుల అడ్డగింత

మర్రిగూడ : డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న మండలంలోని శివన్నగూడెం రిజర్వాయర్ పనులను చర్లగూడెం భూనిర్వాసితులు అడ్డుకున్నారు. అనంతరం రిజర్వాయర్ మెయిన్ క్యాంపు ఎదురుగా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం, ప్యాకేజీ అందించి ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూనిర్వాసితులు, మహిళలు రాత్రి సమయంలో దీక్షను కొనసాగించి బస చేశారు. విషయం తెలుసుకున్న రిజర్వాయర్ ఈఈ రాములునాయక్ నిర్వాసితులతో మాట్లాడుతూ విషయాన్ని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డితోపాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని భరోసా కల్పించినప్పటికీ న్యాయం జరిగేంతవరకు దీక్షను విరమించమని భీష్మించారు. కార్యక్రమంలో వల్లపు కేశవులు, ఎరుకల నిరంజన్, కుంచపు కొండయ్య, రాంకోటి, సైదులు, ఎల్లయ్య, సుగుణమ్మ, సత్యనారాయణ, గంగమ్మ తదితరులు ఉన్నారు.



రాత్రి వేళ కూడా నిరసన వ్యక్తం చేస్తున్న చర్లగూడెం భూ నిర్వాసితులు



సభా వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

పోరుగడ్డకు అండగా ఉంటాం..

- తుంగతుర్తి నియోజకవర్గానికి పూర్తిస్థాయిలో గోదావరి జలాలు తీసుకొస్తాం
- రైతును రాజుగా చేస్తేనే ఇందిరమ్మ ఆత్మ శాంతిస్తుంది
- కాంగ్రెస్ కార్యకర్తల కష్టంతోనే ఈ స్థాయిలో ఉన్నాం..
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి
- తిరుమలగిరి సభలో లబ్ధిదారులకు కొత్త రేషన్‌కార్డుల పంపిణీ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ, తిరుమలగిరి (తుంగతుర్తి) : 'భూమి.. భుక్తి.. విముక్తి కోసం పోరాడిన గడ్డ తుంగతుర్తి.. ఈ గడ్డకు గొప్ప చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో భీంరెడ్డి నర్సింహారెడ్డి, ధర్మభిక్షం, దొడ్డి కొమురయ్య, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం సాయుధ పోరాటంలో అగ్రభాగాన నిలిచి నల్లగొండ జిల్లాను ఎర్రగొండగా మార్చారు. నల్లగొండ జిల్లా చరిత్రనే తెలంగాణ చరిత్ర. అలాంటి గడ్డ నుంచే ఈరోజు పేదలకు రేషన్ కార్డులు అందిస్తున్నాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి ముందుగా రూ.34 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పేదలకు రేషన్‌కార్డులు అందజేసి మాట్లాడారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో మొదటి సార్వత్రిక ఎన్నికల్లో రావి నారాయణరెడ్డికి దేశంలోనే అత్యధిక మెజార్టీ ఇచ్చి ఇక్కడి ప్రజలు తెలంగాణ పౌరుషాన్ని చూపించారని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా తుంగతుర్తి నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకొచ్చి సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. రైతు రాజుగా మారినప్పుడే ఇందిరమ్మ ఆత్మ శాంతిస్తుందని తెలిపారు. రేషన్‌కార్డుల పంపిణీ చేయడం అంటే తెలంగాణలోని నాలుగు కోట్ల మంది పేదలకు సన్న బియ్యం వడ్డించడమేనని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బహిరంగ సభకు 6 గంటలు ఆలస్యంగా వచ్చినా పెద్ద ఎత్తున జనం తరలివచ్చి కరెంటు లేకున్నా సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఎదురు చూసి మందుల సామే



సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ల్‌కు 60 వేల మెజార్టీ ఇచ్చారని గుర్తుచేశారు. కార్యకర్తల కష్టం వల్లే ఈ రోజు మనం అందరం గెలిచి, ఈ స్థానంలో ఉన్నామని, మనకు పదవులు రావడానికి కార్యకర్తలే కారణమని వారిని గెలిపించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని అందర్నీ సమన్వయం చేసుకొని కలుపుకు పోవాలన్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని గొప్ప మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాదరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బాలునాయక్, లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, రామచందర్‌నాయక్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు రమేష్‌రెడ్డి, సంకెపల్లి సుధీర్‌రెడ్డి, చెవిటి వెంకన్నయాదవ్, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు తేజస్‌నందలాల్ పవార్, ఇలా త్రిపాఠి, హనుమంతరావు, సివిల్ సప్లయీస్ కమిషనర్ డీఎస్.చౌహాన్ పాల్గొన్నారు.

పదేళ్లు రాచరిక పాలన సాగింది
– అడ్లూరు లక్ష్మణ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి



2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో రాచరిక పాలన సాగిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ విమర్శించారు. పది సంవత్సరాల్లో ఒక్కరికి కూడా రేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీలకు ఏ, బీ, సీ, డీ వర్గీకరణ, కులగణన, సన్నబియ్యం పంపిణీ, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, 59 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించాయని తెలిపారు.

కాంగ్రెస్‌కు కంచుకోట
– మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తుంగతుర్తి ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కాపాడారని, గతంలో మా తమ్ముడు రాజగోపాల్‌రెడ్డి, నేను పార్లమెంటు సభ్యులుగా గెలిచామన్నారు. బిక్కేరు వాగుపై బ్రిడ్జి, నాగారం, అడ్డగూడూరు మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు మంజూరు చేశారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

ఆ ఆలోచన బీఆర్‌ఎస్‌కు రాలే..
– ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మందుల సామేల్‌కు 50 వేలకు పైగా మెజార్టీ వస్తే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు 70 వేలకు పైగా మెజార్టీ వచ్చిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పది సంవత్సరాల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సన్న బియ్యాన్ని అత్తగారింట్లో (హుజూర్‌నగర్‌లో) ప్రారంభించారని, రేషన్ కార్డులను పుట్టినింటిలో (తుంగతుర్తి నియోజకవర్గంలో) ప్రారంభించేలా చేశారని పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి
– ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని, సమస్యలు పరిష్కరించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో 13 గ్రామాలకు దేవాదుల ద్వారా గోదావరి జలాలు అందివ్వాలని, ఎస్‌ఆర్‌ఎస్పీ కాల్వలు అసంపూర్తిగా ఉన్నాయని, లైనింగ్ చేయాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు.

టార్గెట్.. జగదీష్‌రెడ్డి

- గంజాయి మొక్కతో పోల్చిన సీఎం

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని టార్గెట్ చేసుకొని తిరుమలగిరి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. 'సూర్యాపేటలో ఉన్న మూడడుగులాయన ఈ సభకు సీఎం ఎట్ల వస్తరని అంటున్నరు. కేసీఆర్ ఉంటే గోదావరి జలాలు మూడు రోజులలో తీసుకువస్తానని అంటున్నరు. మరి పదేళ్లు ఎందుకు తేలేకపోయారు' అని రేవంత్‌రెడ్డి దుయ్యబట్టారు. గోదావరి జలాలు తేవడమంటే మందులో సోడా కలిపినట్లు కాదన్నారు. 'పదేళ్ల దొరగారి దగ్గర ఫామ్‌హౌస్‌లో గడ్డి పీకావా.. పదేళ్లలో ఒక్కనాడైనా ఆలోచించావా' అని ప్రశ్నించారు. 'మీ ఊరును మండలం చేశావు. మండలానికి అధికారులను తెచ్చుకున్నవు. మీ మండలానికి ఎంఆర్‌వో ఆఫీస్, పోలీస్ స్టేషన్ కూడా కట్టించుకోలేదు. వాటికి మా మందుల సామేల్ స్థలాన్ని ఇప్పించి కట్టిస్తున్నడు' అని అన్నారు. తన ఊరికి ఏం చేయలేని ఆయన ముఖ్యమంత్రిని అడ్డుకుంటాడట. కాంగ్రెస్ కార్యకర్తలే ఆయన్ను చూసుకోవాలన్నారు. మా దామన్న ఒక్కడు చాలు. వారి కథకమామిషు ఏందో చూసుకుంటారని అన్నారు. ఇది అధికార కార్యక్రమం కాబట్టి ఇంకా వారి గురించి ఎక్కువగా మాట్లాడదల్చుకోలేదు. పదేళ్లు మంత్రిగా చేసిన ఆయన మొన్న ఎన్నికల్లో తులసి వనంలో గంజాయి మొక్కలా ఒక్కడే గెలిచిండు. ఆ మొక్కను కూడా వచ్చే ఎన్నికల్లో కూకటి వేళ్లతో పీకేయాలన్నారు.

సామేల్‌కు హితబోధ



అసెంబ్లీ ఎన్నికలకు ముందు మందుల సామేల్ రూ.50 వేలతో వస్తే.. నియోజకవర్గ ప్రజలు 60 వేల మెజార్టీతో గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వారిని గుండెల్లో పెట్టుకుని ఎమ్మెల్యేను చేసింద్రు. అందుకే వారి మంచి చెడుల్లో పాలుపంచుకోవాలి. సోనియాను నమ్మి గెలిపించారు. కడుపులో పెట్టుకోవాలి. ఒకరికి బాధ ఉంటది, ఒకరికి దుఃఖం ఉంటది, ఒకరికి కోపం ఉంటది. ఒకరికి ఆలోచన ఉంటది. మరొకరికి ఆశ ఉంటంది.. కాబట్టి స్థానిక ఎమ్మెల్యేగా నువ్వే ఓపికతో అన్నీ ఆలోచించి అందరినీ కలుపుకుపోవాలి. ఏదేనా సమస్య ఉంటే ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నారు. అవసరమైతే నా దృష్టికి తీసుకురండి మీ సమస్య పరిష్కరిస్తానన్నారు. రాష్ట్రంలో నలుగురు ఎమ్మెల్సీలకు అవకాశం వస్తే అందులో నల్లగొండ జిల్లాకే ముగ్గురికి ఇచ్చాను. పీసీసీ అధ్యక్షుడు కూడా నల్లగొండ కార్యకర్తలతో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు ఉంటే చర్చించి పరిష్కరించాలన్నారు. ఇక్కడి ప్రజలకు కోపం వస్తే దాచుకోరని, గట్టిగా కోపంగా మాట్లాడతారని, అయితే, వివరించి చెబితే వింటారని, తనకు ఆ విశ్వాసం ఉందన్నారు. కార్యకర్తలను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా గెలిపించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం అన్నారు.



తుంగతుర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి



లబ్ధిదారుకు కొత్త రేషన్‌కార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

గ్రీవెన్స్‌డే ఫిర్యాదులు పరిష్కరించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా కలెక్టరేట్‌కు వచ్చిన బాధితుల నుంచి ఆమె అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. భూ సమస్యలు, పెన్షన్లపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. మధ్యాహ్నం వరకు వినతులు స్వీకరించిన కలెక్టర్.. ఆ తర్వాత అధికారులతో సమావేశమయ్యారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

మహిళను మందలించిన కలెక్టర్..

గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసేందుకు ఓ మహిళ అక్కడి అధికారికి వినతిపత్రం సమర్పించిన సందర్భంలో.. సదరు అధికారులతో దురుసుగా మాట్లాడింది. దాంతో కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రీవెన్స్ నిర్వహించేది ప్రజల సమస్యలు పరిష్కరించడానికేనని.. సమస్య ఉంటే విన్నవించాలని, బెదిరింపు ధోరణి సరికాదని ఆ మహిళను కలెక్టర్ మందలించారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కుటుంబ పాలన అంతమొందించాలి



సమ్మేళనంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు, వేదికపై జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి తదితరులు


- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

నల్లగొండ టూటౌన్ : చైతన్యానికి మారుపేరైన నల్లగొండ గడ్డపై కుటుంబ పాలనను అంతమొందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత తొలిసారి నల్లగొండ జిల్లా కేంద్రానికి వచ్చిన రామచందర్‌రావుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, భార్యభర్తలు ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎన్నికవుతూ కుటుంబపాలన నడిపిస్తున్నారని విమర్శించారు. ఈ జిల్లాలోనే సీఎం రేవంత్‌రెడ్డి రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టారని, దళారుల ద్వారా రేషన్‌కార్డులు ఇస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఎస్ఎల్‌బీసీ పేరు చెప్పుతారే తప్ప ఇంతవరకు పూర్తి చేయలేదని, అందులో చిక్కుకున్న వారి జాడ కూడా కనిపెట్టలేకపోయారని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్ర పోనియ్యమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చింత సాంబమూర్తి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్, బండారు ప్రసాద్, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, పల్లెబోయిన శ్యాంసుందర్, పోతెపాక సాంబయ్య పాల్గొన్నారు.

సాగర్ నీటి విడుదలపై సందిగ్ధం!

- ప్రభుత్వం నుంచి వెలువడని ప్రకటన
- ఎదురుచూపుల్లో ఆయకట్టు రైతాంగం

నాగార్జునసాగర్ : సాగర్ ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేసేందుకు నేటికి ముహూర్తం ఖరారు కాలేదు. ఈ యేడాది కృష్ణానదికి ముందస్తుగానే వరద రావడంతో అదనంగా వచ్చే నీరంతా నాగార్జునసాగర్ జలాశయానికే వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటి మట్టం 590.00 అడుగులు (312.0450 టీఎంసీలు)కాగా.. ప్రస్తుతం 554.00 అడుగులు (218.6760 టీఎంసీలు)గా ఉంది. మరో 94 టీఎంసీల నీరు వచ్చి చేరితే జలాశయం గరిష్టస్థాయికి చేరుకుంటుంది. ఈ ఏడాది జూన్ మాసంలో సాగర్ జలాశయం 511.60అడుగులు (134.4032 టీఎంసీలు)గా ఉంది. ఇప్పటివరకు 84 టీఎంసీల నీరు వచ్చి చేరింది. గత ఏడాది సాగర్ జలాశయంలో 528.00 అడుగుల నీరున్నప్పుడే కాల్వలకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 554 అడుగుల నీరుంది. కానీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. అయితే ఎగువనుంచి వస్తున్న వరదను పరిశీలిస్తూ ఈ నెల 20వ తేదీ వరకు నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.



జిల్లాలో 3,98,790 ఎకరాల ఆయకట్టు

సాగర్ ఎడమ కాల్వకింద నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 51 మేజర్ల కింద 3,98,790 ఎకరాల ఆయకట్టు ఉంది. 47 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఈ ఏడాది వర్షాలు కూడా సరిగా లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. సాగరకు ఎగువ నుంచి వరద వస్తున్నందున వెంటనే నీటిని విడుదల చేస్తే నార్లు పోసుకునే అవకాశం ఉంటుంది. భూగర్భ జలాలు కూడా పెరుగుతాయి. వర్షాకాలం ఇంకా మూడు నెలల 15 రోజులు ఉంది.. ఒక వేళ వరద పెరిగితే.. నీటిని సముద్రంలోకి విడుదల చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి వెంటనే నీటిని విడుదల చేయాలని నల్లగొండ, సూర్యాపేట జిల్లాల రైతులు కోరుతున్నారు.

సమావేశం వాయిదా..

రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, నీటి విడుదలపై నీటిపారుదల శాఖ అధికారులతో సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ సమావేశం నిర్వహించాల్సి ఉంది. కానీ, సూర్యాపేట జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉండడంతో ఆ సమావేశం వాయిదా పడినట్లు తెలిసింది.

శ్రీశైలం నుంచి ఒక్క గేటు ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్: శ్రీశైలం జలాశయం నుంచి ఒక రేడియల్ క్రస్ట్ గేటు 10అడుగులు ఎత్తి స్పిల్‌వే మీదుగా 27,065 క్యూసెక్కుల నీటిని సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 68,339 క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తం సాగర్ జలాశయానికి 95,404 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఎఫ్‌సీఐ సిబ్బందిపై విచారణ

మిర్యాలగూడ : అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఫిర్యాదు మేరకు డీసీఓ ఆదేశాలతో మిర్యాలగూడ ఎఫ్‌సీఐలో పనిచేస్తున్న మాలోతు లాలు, భిక్షానాయక్‌లను సోమవారం సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ షేక్ బాజి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు తీసుకుని విచారణ పూర్తిచేశామని, డీసీఓకు నివేదిక అందజేస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విచారణ చేపడుతున్న షేక్ బాజీ

నీటిని తరలిస్తున్నా మంత్రి నోరుమెదపట్లే..

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

మిర్యాలగూడ : నల్లగొండ జిల్లాలోని చెరువులు, కుంటలను నింపకుండా సాగర్ నీటిని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తరలించుకెళ్తున్నా.. జిల్లాకు చెందిన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నోరుమెదపట్లేదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీందర్‌నాయక్ మండిపడ్డారు. సోమవారం మిర్యాలగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్‌కు వరదనీరు వస్తున్నా నీటిని విడుదల చేసి నల్లగొండ జిల్లాలోని చెరువులు, కుంటలను నింపడంలేదన్నారు. బీసీల హక్కుల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ కవితపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దుర్భాషలాడడం సరైందికాదని.. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలనే రేషన్‌కార్డుల పంపిణీకి ప్రజాధనాన్ని వృథా చేస్తూ సభలు, సమావేశాలు పెడుతున్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అన్నభీమోజు నాగార్జునచారి, యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, చిట్టిబాబు నాయక్, బాలాజీనాయక్, హాతీరాం, యూసుఫ్, మోసిన్‌అలీ, చిర్ర మల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవీంద్రకుమార్

క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

నకిరేకల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. నకిరేకల్ పట్టణంలోని 2వ వార్డు పద్మశాలీ కాలనీ సమీపంలో నంద సుధీర్ నివాసముంటున్నాడు. సుధీర్ ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి సోఫా పక్కన తన సెల్‌ఫోన్ ఛార్జింగ్ పెట్టి బాత్‌రూంకు వెళ్లాడు. 10 నిమిషాల తర్వాత సుధీర్ బాత్‌రూంలో నుంచి బయటకు వచ్చేసరికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఇళ్లంతా పొగతో నిండిపోయింది. సుధీర్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి బోరు మోటారు నీటితో మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లోని ఏసీ, వాషింగ్ మిషన్, ఫ్రిజ్, సోఫాతో ఇతర వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.4లక్షల నుంచి రూ.5లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నాడు. మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, 2వ వార్డు కౌన్సిలర్ రాచకొండ సునీల్ బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వం పరంగా నష్టపరిహారం అందజేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

చెరువులో పడి బాలుడు మృతి


జీవన్‌కుమార్ (ఫైల్)

సూర్యాపేటటౌన్ : ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయిన బాలుడు చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డకు చెందిన గొబ్బి కనకలక్ష్మి చిన్న కుమారుడు జీవన్‌కుమార్(15) ఈ నెల 12న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటికి తాళం వేసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఎంత వెతికినా జీవన్ కుమార్ ఆచూకీ లభించకపోవడంతో అతడి తల్లి సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువులో జీవన్ కుమార్ మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సద్దుల చెరువు వద్దకు చేరుకుని చనిపోయింది జీవన్‌కుమారే అని నిర్ధారించారు. మృతుడి తల్లి కనకలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సూర్యాపేట పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడు ప్రస్తుతం పదో తరగతి చదువుతుండగా.. అతడి తండ్రి గతంలోనే మృతిచెందాడు.

రైస్‌మిల్లులో కింద పడి ఆపరేటర్ మృతి

పెన్‌పహాడ్: రైస్‌మిల్లులో పనిచేసే ఆపరేటర్ ప్రమాదవశాత్తు మిషన్ పైనుంచి కింద పడి మృతిచెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలం న్యూబంజారాహిల్స్ తండాలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ ఆంగోతు యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. న్యూబంజారాహిల్స్ తండాలోని శ్రీమహాలక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లులో గరిడేపల్లి మండలం కుత్బుషాపురం గ్రామానికి చెందిన సలిగంటి సోమయ్య(48) మిల్లు ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్ర సోమయ్య మిల్లులో మిషన్‌పై పనిచేస్తుండగా ప్రమాదశాత్తు పైనుంచి కిందపడిపోయాడు. అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైస్‌మిల్లు యాజమాని ఇస్లావత్ వెంకన్నపై మృతుడి కుమారుడు వినిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

జాతీయ రహదారిపై లారీ బీభత్సం

- అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాల పైకి దూసుకెళ్లిన లారీ
- భయంతో రన్నింగ్‌లోనే లారీ దిగి పారిపోయిన డ్రైవర్
- పలు కార్లు, ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఘటన


ప్రమాదానికి కారణమైన లారీ

చౌటుప్పల్: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో సోమవారం సాయంత్రం లారీ బీభత్సం సృష్టించింది. లారీ అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాల పైకి దూసుకెళ్లింది. దీంతో భయాందోళనకు గురైన లారీ డ్రైవర్ కదులుతున్న లారీలో నుంచి బయటకు దూకి పారిపోయాడు. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ పలు కార్లు, బైక్‌లు ధ్వంసమయ్యాయి. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్తాన్ రిజిస్ట్రేషన్ నంబర్ గల లారీ హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం చౌటుప్పల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి రాగానే అతివేగంగా ఉన్న లారీ అదుపుతప్పడంతో డ్రైవర్ ముందు వెళ్తున్న కారును ఢీకొట్టాడు. అదే వేగంతో మరో కారును సైతం ఢీకొట్టాడు. ముందున్న రద్దీని చూసిన లారీ డ్రైవర్ భయాందోళనకు గురై వేగంగా కదులుతున్న లారీలో నుంచి కిందకు దూకేశాడు. దీంతో లారీ అదే వేగంతో ముందు వరుసగా వెళ్తున్న కార్లను, ద్విచక్ర వాహనాలను ఢీకొట్టుకుంటూ విజయవాడ-హైదరాబాద్ హైవే సర్వీస్ రోడ్డులోకి దూసుకెళ్లింది. లారీ బీభత్సాన్ని గమనించిన ఇతర వాహనదారులు, హైవే వెంట నిల్చున్న జనం బిగ్గరగా కేకలు వేశారు. కేకలు విన్న ప్రజానీకం అప్రమత్తమై లారీకి దూరంగా వెళ్లారు. అలా సర్వీస్ రోడ్డులో ఉన్న పూలు, అరటిపండ్ల బండ్లను ఢీకొట్టి లారీ ఆగిపోయింది. ఈ ఘటనలో ఓ ద్విచక్ర వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదానికి లారీ అతివేగం కారణమా లేదా డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నాడా అనేది తెలియరాలేదు. లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. మొత్తం ఆరు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, పలు పూలు, అరటిపండ్ల బండ్లు ధ్వంసమయ్యాయి. ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనా స్థలంలో ధ్వంసమైన కార్లు



ఆలేరులో ఒకే రోజు మూడు చోరీలు

ఆలేరు: ఆలేరు పట్టణంలో దొంగలు ఒకే రోజు మూడు చోరీలకు పాల్పడ్డారు. సీఐ కొండల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన పరత్వం చిన్నా, వస్పరి వెంకటేష్ చిక్కు వెంట్రుకల వ్యాపారం చేస్తుంటారు. వ్యాపారం నిమిత్తం చిన్నా నెల రోజుల క్రితం, వెంకటేష్ వారం రోజుల కిత్రం వారి ఇళ్లకు తాళాలు వేసి వేరే గ్రామాలకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు చిన్నా, వెంకటేష్ ఇళ్ల తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. చిన్నా ఇంట్లో 15తులాల వెండి, పావు తులం బంగారు పుస్తెలతాడు, వెంకటేష్ ఇంట్లో 3గ్రాముల బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని చేరుకుని క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ పరిశీలించగా ఇద్దరు దొంగలు చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.


ఆలేరు: చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం బృందం

బైక్ చోరీ..

అదేవిధంగా ఆలేరు పట్టణంలోని నూనె మిల్లు రోడ్డులో నివాసముంటూ సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే మరుపల్లి ప్రవీణ్ ఆదివారం రాత్రి తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. సోమవారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆదివారం రాత్రి ఇద్దరు దుండగులు బైక్‌ను అపహరించినట్లు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించామని సీఐ కొండల్‌రావు తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: చిట్యాల పట్టణంలోని విద్యానగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో నివాసముంటున్న బత్తిని మహేష్ ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం తన ఇంటికి తాళం వేసి ఆయన ఉద్యోగానికి వెళ్లగా.. ఆయన భార్య స్థానికంగా కుట్టు మిషన్ నేర్చుకునేందుకు వెళ్లింది. వారు సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాలో దాచిన రెండు బంగారు లాకెట్‌లు, మాటీలు, వెండి ప్లేట్‌తో పాటు కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు మహేష్ చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

20న ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు

నల్లగొండ టూటౌన్: అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20వ తేదీన నల్లగొండ పట్టణంలోని న్యూస్ స్కూల్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో పోటీలు స్విస్ పద్ధతిలో ఐదు రౌండ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామని, ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 19వ తేదీ లోగా 9985423823 వాట్సాప్ నంబర్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆదర్శ టీచర్లు.. ప్రభుత్వ బడుల్లోనే పిల్లలు


అనాజిపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాలలో తమ పిల్లలను చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : మండలంలోని అనాజిపురం పీఎంశ్రీ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్లలను అదే పాఠశాలలో చేర్పి ఆదర్శంగా నిలిచారు. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వావిలాల సూర్యగౌడ్ తన కుమార్తె ఆరాధ్యను ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో, కుమారుడు విరాట్ సూర్యను 9వ తరగతిలో చేర్పించారు. మరో టీచర్ ఎ. లింగయ్య తన కుమార్తె రసజ్ఞను 6వ తరగతిలో చేర్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కోడి లింగయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు తమ పిల్లలను ఆదర్శ పాఠశాలలో చేర్పించడంతో ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపే ఇతర తల్లిదండ్రులకు స్ఫూర్తినిస్తుందని అన్నారు.

మహిళను వేధించిన కేసులో నిందితుడికి జైలు శిక్ష

నిడమనూరు: మహిళను వేధించిన కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధిస్తూ సోమవారం నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి టి. స్వప్న తీర్పు వెలువరించారు. వివరాలు.. నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన పెదమాము దుర్గమ్మపై అదే గ్రామానికి చెందిన పెదమాము అంజయ్య 2015 డిసెంబర్ 18న రాత్రి ఆమె ఇంటికెళ్లి బలాత్కారం చేయబోయాడు. దుర్గమ్మ భయభ్రాంతులకు గురై గట్టిగా కేకలు వేయడంతో అంజయ్య పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి నిడమనూరు ఎస్ఐ నర్సింహరాజు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసు తుది విచారణలో సోమవారం జడ్జి టి. స్వప్న నిందితుడు అంజ్యకు రెండేళ్ల జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. సాధన వాదనలు వినిపించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని నల్ల చెరువు సమీపంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు, పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్ల చెరువు సమీపంలో పూర్తిగా కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహాన్ని సోమవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సదరు వ్యక్తి సుమారు 10రోజుల క్రితమే మృతి చెందడంతో పూర్తిగా శరీరం కుళ్లిపోయినట్లు సీఐ తెలిపారు. గుర్తించడానికి వీల్లేకుండా మృతదేహం ఉందని, అతడి ఒంటిపై ఉన్న దుస్తుల్లో సైతం ఎలాంటి ఆధారాలు లభించలేదని సీఐ వెల్లడించారు. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తూఫ్రాన్‌పేట గ్రామ శివారులో..

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం తూఫ్రాన్‌పేట శివారులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూఫ్రాన్‌పేట శివారులోని అశోక ఇంజనీరింగ్ కళాశాల గేట్ వద్ద బస్టాప్‌లో సోమవారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి 42ఏళ్లు ఉంటాయని, మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి


వెంకటేశ్వర్లు (ఫైల్)

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పుప్పాల వెంకటేశ్వర్లు (41) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విధుల్లో భాగంగా హైదరాబాద్‌కు వెళ్లిన ఆయన అస్వస్థతకు గురై పడిపోయారు. వెంటనే అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలానికి చెందిన వెంకటేశ్వర్లు గతేడాది భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతి పట్లు ఇన్‌స్పెక్టర్ రమేష్‌కుమార్, ఎస్ఐలు కుమారస్వామి, లక్ష్మీనారాయణ, జయరాజు సంతాపం ప్రకటించారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

- ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


అవగాహన కార్యక్రమానికి హాజరైన వీసీ అల్తాఫ్ హుస్సేన్‌కు మొక్క అందజేస్తున్న విద్యార్థి

నల్లగొండ టూటౌన్: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటే ఉపాధి అవకాశాలు లభిస్తాయని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. సోమవారం ఎంజీయూ సెమినార్ హాల్‌లో యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కాంపిటస్ ఫార్మా ట్రైనింగ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ పాల్గొని మాట్లాడారు. నేటి తరం విద్యార్థులకు నైపుణ్యాలే ప్రామాణికమని, నిత్య విద్యార్థులుగా నైపుణ్యాలు మెరుగుపర్చుకుంటూ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. కాంపిటస్ ఫార్మా ట్రైనింగ్ సెంటర్ ప్రతినిధి దీపక్‌వర్మ మాట్లాడుతూ.. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. నైపుణ్యాలు, ఇంటర్వ్యూ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ్‌సాగర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ తిరుమల, కోఆర్డినేటర్ డాక్టర్ అభిలాష తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

- రూ.40వేల విలువైన గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు

నల్లగొండ: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు తెలిపారు. ఈ కేసు వివరాలను సీఐ సోమవారం విలేకరులకు వెల్లడించారు. నల్లగొండ పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పెరిక కరణ్ జయరాజ్, శాలిగౌరారం మండలం వల్లాల గ్రామానికి చెందిన ప్రైవేట్ టీచర్ శివశంకర్, వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన మార్బుల్ వర్కర్ పెద్దమాము వీరస్వామి స్నేహితులు. వీరు ముగ్గురు గంజాయికి బానిసై హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో గంజాయి కొనుగోలు చేసి తాగేవారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పెరిక కరణ్ జయరాజ్ డబ్బులు పెట్టుబడి పెట్టి శివశంకర్‌ను హైదరాబాద్‌కు పంపగా అతడు ధూల్‌పేటలో కిలో గంజాయి రూ.10వేలకు కొనుగోలు చేసి నల్లగొండకు తీసుకొచ్చేవాడు. వీరు ముగ్గురు కలిసి గంజాయిని చిన్న ప్యాకెట్లుగా మార్చి నల్లగొండలో గంజాయి తాగే వ్యక్తులకు ఒక్కో ప్యాకెట్ రూ.500కు అమ్మేవారు. సోమవారం వీరు ముగ్గురు కలిసి నల్లగొండలో గంజాయిని చిన్న ప్యాకెట్లుగా మారుస్తుండగా.. పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40వేలు విలువ చేసే కిలోన్నర గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో నిందితులను పట్టుకున్న ఎస్ఐ సైదులు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు రాధమ్మ మృతి

- 1952 నుంచి 2024 వరకు అన్ని జనరల్ ఎలక్షన్స్‌లో ఓటు వేసిన రికార్డు ఆమె సొంతం


రాధమ్మ (ఫైల్)

కోదాడరూరల్: కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ కేఎల్‌ఆర్ కాలనీలో నివాసముంటున్న స్వాతంత్ర్య సమరయోధురాలు జలగం రాధమ్మ (100) అనారోగ్యంతో సోమవారం మృతిచెందింది. 1924లో సూర్యాపేట వద్ద గల నశీంపేటలో జన్మించిన ఆమె స్వాతంత్ర్య ఉద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొంది. రజాకార్లతో జరిగిన పోరాటంలో అడవుల్లో తలదాచుకున్న యువతకు ఆమె కూలి అవతారమెత్తి ఆహారం అందించింది. అంతేకాకుండా 1952 మొదటి జనరల్ ఎలక్షన్ నుంచి 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల వరకు ప్రతి ఎన్నికలో ఆమె ఓటు హక్కు వినియోగించుకుని రికార్డు సృష్టించింది. ఆమెకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు సంతానం కాగా.. కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ కేఎల్‌ఆర్ కాలనీలో తన పెద్ద కుమారుడి ఇంట్లో మృతిచెందింది. రాధమ్మ మృతి పట్ల పలువురు నివాళులర్పించారు.

భార్య, బావమర్దే సూత్రధారులు

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిది హత్యే అని గుర్తించిన పోలీసులు
- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు వెల్లడి

మోటకొండూర్: మోటకొండూర్ మండలం కాటేపల్లి సమీపంలో ఆదివారం అర్ధరాత్రి బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. అయితే వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని మృతుడిని అతడి భార్య, బావమర్ది కలిసి హత్య చేయించినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వస్తుపుల స్వామి(36), తన స్నేహితుడు మద్దికుంట వీరబాబు ఆదివారం అర్ధరాత్రి భువనగిరి మండలం రాయిగిరి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. మోటకొండూర్ మండలం కాటేపల్లి గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్దకు రాగానే వెనుక నుండి వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌ను కారు కొద్దిదూరం లాక్కెళ్లడంతో స్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుక కూర్చున్న వీరబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్వామి మృతదేహాన్ని, గాయపడిన వీరబాబును స్థానికులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరబాబును మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా సోమావరం ఉదయం మృతుడు స్వామి బాబాయి ఐలయ్య ఈ ప్రమాదంపై పలువురిపై అనుమానం వ్యక్తం చేస్తూ మోటకొండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు ఇది రోడ్డు ప్రమాదం కాదని.. వివాహేతర సంబంధం కారణంగానే స్వామిని అతడి భార్య స్వాతి, స్వాతి సోదరుడు మహేష్ కలిసి సుపారీ ఇచ్చి హత్య చేయించినట్లు గుర్తించారు. పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు. మృతుడు స్వామికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.

'ఇందిరమ్మ' బిల్లు మంజూరు చేయాలని ఆందోళన

- పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని వ్యక్తి హల్‌చల్


పురుగు మందు డబ్బాతో చినమల్లయ్య

మర్రిగూడ: ఇందిరమ్మ ఇంటికి సంబంధించిన బిల్లు మంజూరు చేయాలని మర్రిగూడ మండలం లెంకలపల్లికి చెందిన ఏర్పుల చినమల్లయ్య సోమవారం గ్రామంలో ఆందోళన చేపట్టాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి తన ఇంటి వివరాలను ఫొటో క్యాప్చర్ చేయడం లేదని, తనకు రావాల్సిన ఇందిరమ్మ ఇల్లు బిల్లు మంజూరు కాకుండా చేశారని, తనకు వెంటనే ఇందిరమ్మ ఇల్లు చెల్లించాలని, లేదంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. ఈ ఘటనతో గ్రామంలో బస్సులు, ఇతర వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మర్రిగూడ పోలీసులు గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై లెంకలపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమాదేవిని వివరణ కోరగా.. ఏర్పుల చిన్నమల్ల య్యకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని.. కానీ అతడు గతంలోనే స్లాబ్ లెవల్ వరకు ఇంటిని నిర్మించాడని పేర్కొంది. ఇందిరమ్మ ఇల్లు నిబంధనల ప్రకారం నాలుగో లెవల్ వరకు అతడు ఇల్లు నిర్మించాడని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి ముందు ముగ్గు, పిల్లర్లు, బేస్‌మెంట్ ఇలా అనేక ప్రక్రియలు ఫొటోలు తీసి ఆన్‌లైన్ చేస్తేనే బిల్లు మంజూరు అవుతుందని ఆమె తెలిపింది.

వరి నాట్లు వేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలి

పాడిపంట



గుర్రంపోడు: వానాకాలం సీజన్ ప్రారంభమై రైతులు వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వరి విత్తనం, నారు ద్వారా సంక్రమించే తెగుళ్లు, నారుదశలో ఆశించే పురుగులు, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గుర్రంపోడు మండల వ్యవసాయాధికారి కంచర్ల మాధవరెడ్డి వివరించారు.

నారు మడి తయారీలో..

నారు మడి తయారు చేసేటప్పుడు 2 సెంట్ల నారు మడికి 1 నుంచి 1.5 కిలోల వేప పిండి వేయాలి. నాణ్యమైన విత్తనం ఎంచుకుని విత్తన శుద్ధి చేయాలి. కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్‌ను కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలి. నారుమడులైతే లీటరు నీటికి గ్రాము కార్బండిజమ్ మందును కలిపి ఆ ద్రావణంలో కిలో వరి విత్తనాలు 24 గంటలు నానబెట్టాలి. తర్వాత విత్తనాన్ని మళ్లీ 24 గంటలు మండె కట్టాలి. ఇలా మొలకెత్తిన విత్తనాన్ని నారు మడిలో చల్లుకోవాలి. విత్తిన 10 రోజులకు ఒక సెంటు నారుమడికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 160 గ్రాముల చొప్పున వేయాలి. ఒక మిల్లీలీటరు క్లోరోపైరిపాస్ 20ఈసీ మందును లీటరు నీటికి కలిపి ఆ ద్రావణంలో నారు వేర్లు మునిగేటట్లు 3గంటల పాటు ఉంచిన తర్వాత ప్రధాన పొలంలో నాటుకోవాలి. దీని వల్ల కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు, సుడిదోమ వంటి పురుగులను అరికట్టవచ్చు. వరి నాటే ముందు నారు కొనలు తుంచి నాటుకోవడం వల్ల కాండం తొలుచు పురుగు బెడద తగ్గించుకోవచ్చు.

ప్రధాన పొలంలో..

నాట్లు వేసే ముందు కనీసం పది రోజుల ముందు పొలాన్ని 2–3 దఫాలుగా దమ్ము చేయాలి. నారు తీసేటప్పుడు మొక్కల ఆకులు లేతాకు పచ్చగా ఉంటే త్వరగా కొత్త ఆకులు వస్తాయి. కనీసం నాలుగు, ఆరు ఆకులు ఉన్న నారు నాట్లు వేయడానికి వాడాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. నాటు పైపైగా వేస్తే పిలకలు ఎక్కువగా వస్తాయి. చదరపు మీటరుకు కనీసం 44 మొనలు ఉండేలా చూసుకోవాలి. ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాటలు తీయాలి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసే ముందు ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలి.

ఆలేరులో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్


ప్రజలకు సూచనలు చేస్తున్న సీఐ కొండల్‌రావు

ఆలేరు: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆలేరు పట్టణంలో పోలీసులు సోమవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. శ్రీకనకదుర్గ దేవాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాలు, దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సీఐ కొండల్‌రావు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాపేట, గుండాల,ఆలేరు ఎస్ఐలు అనిల్, సైదులు, వినయ్‌తోపాటు వంద మంది ఆర్మ్‌డ్ రిజ్వర్డు పోలీసులు పాల్గొన్నారు.